




ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 195 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/-
బుధవారం 19 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# మోదీ ఏదో చెప్పబోయారు.. నేను టారిఫ్ఫు తప్పవన్నా: ట్రంప్

**భారత్ ఎంత పన్ను విధిస్తే.. అంతే తాము విధిస్తామని ప్రధాని మోదీకి నేరుగా చెప్పినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.**

(రిపబ్లిక్ న్యూస్), ఫిబ్రవరి 19: టారిఫ్ విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని తాను మోదీతో వెల్లడించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. వీరిద్దరి మధ్య ఇటీవల జరిగిన మీటింగ్లో టారీఫ్స్ గురించి ఆసక్తికర చర్చ నడిచింది. ఈ విషయాన్ని స్వయంగా ట్రంపే నేడు వెల్లడించారు. బిలియనీర్ మిత్రుడు ఎలాన్ మస్క్ తో కలిసి ఆయన నేడు విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.." మనం ఇక్కడ ఏం చేయబోతున్నాం.. పరస్పరం పన్నులు విధించుకోబోతున్నామని నేను ఇటీవల ప్రధానికి (మోదీకి) చెప్పాను. మీరు ఎంత ఛార్జి చేస్తే.. నేనూ అంతే విధిస్తా. ఇంతలో ఆయన (మోదీ) ఏదో చెప్పబోయారు. వద్దు.. వద్దు నేను దానిని ఇష్టపడను. మీరు ఎంత ఛార్జి చేస్తే.. నేను అంతే విధిస్తాను" అని స్పష్టంగా చెప్పాను.



అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వాటిపై అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ కూడా ఉంది. ముఖ్యంగా ఆటోమొబైల్ రంగంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్లపై దాదాపు 100శాతం సుంకాలను విధిస్తుంది. తాజాగా సమావేశంలో ట్రంప్ పక్కనే కూర్చొన్న మస్క్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. "అవును. ఆటో దిగుమతులపై 100శాతం పన్ను విధిస్తుంది" అని ట్రంప్ వ్యాఖ్యలను సమర్థించారు. దీనికి మరోసారి ట్రంప్ స్పందిస్తూ.. "అవి చాలా చిన్నవి.. వాటిని మించిన సుంకాలు విధిస్తుంది. ఇతరులు కూడా అంతే. నేను 25 శాతం పన్నులు విధిస్తే.. అబ్బో అంత భయంకరంగానా అని అంటారు.. అందుకే నేను ఆ మాట ఇక అనను. వారెంత విధిస్తే.. మనమూ అంతే ఛార్జి చేస్తాం. నాతో ఎవరూ వాదించలేరు. అప్పుడే వారు సుంకాలను నిలిపేస్తారు." అని వివరించారు. పన్ను విషయంలో భారత్ను ట్రంప్ తప్పుపట్టడం ఇదే తొలిసారి కాదు. తన తొలి విడత పాలన సమయంలో కూడా ఇండియన్ టారిఫ్ కింగ్ అని వ్యాఖ్యానించేవారు. ఈ సందర్భంగా భారత్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా డబ్బులు ఇవ్వడంపై కూడా ట్రంప్ స్పందించారు. న్యూఢిల్లీ వద్ద చాలా సొమ్ము ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలు చేస్తున్న దేశాల్లో అది ఒకటిగా అభివర్ణించారు. తనకు భారత ప్రజలు, ఆ దేశ ప్రధాని పట్ల చాలా గౌరవం ఉందన్నారు. కానీ, వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా? మరి మన దేశంలో ఓటర్ల పరిస్థితి ఎలా ఉందని ట్రంప్ ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఇటీవల వాషింగ్టన్లో పర్యటించారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. దీంతోపాటు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు.

# మిర్చి రైతులను ఆదుకోండి.. శివరాజ్ సింగ్ చౌహాన్‌ను చంద్రబాబు లేఖ

**ఏపీలో మిర్చి రైతులను ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు కోరారు.**

అమరావతి, ఫిబ్రవరి 19, (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో మిర్చి రైతులను ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్సింగ్ చౌహాన్‌ను ఆయన లేఖ రాశారు. మార్కెట్ జోక్యం ద్వారా తగ్గిన ధరను భర్తీ చేసేలా చూడాలని కోరారు. సాగు వ్యయానికి, విక్రయధరకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని కోరారు. 50 శాతం నిష్పత్తిలో కాకుండా వందశాతం నష్టాన్ని కేంద్రం భరించాలని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకోవాలని చంద్రబాబు కోరారు. గడిచిన 10 ఏళ్లుగా మిర్చి ఉత్పత్తి, ధరలపై వివరాలను సీఎం సమర్పించారు.



# శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.**



శ్రీశైలం, ఫిబ్రవరి 19, (రిపబ్లిక్ న్యూస్): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, వేద పండితులు యాగశాల ప్రవేశం చేసి ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అదనపు క్యూలైన్ల నిర్మాణం, తాత్కాలిక వసతి, పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయ పరిధిలో స్వాగత తోరణాలను ఏర్పాటు చేయడంతో కొత్త కళను సంతరించుకుంది. బుధవారం రాత్రి 7 గంటలకు బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ధ్వజపటాన్ని ఆవిష్కరించనున్నారు.

# ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు తెదేపా మద్దతు

**ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్లు తెదేపా ప్రకటించింది.**



విశాఖపట్నం, ఫిబ్రవరి 19, (రిపబ్లిక్ న్యూస్): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్లు తెదేపా ప్రకటించింది. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పల్లా శ్రీనివాస్ తో కలిసి శ్రీభరత్ మాట్లాడారు. మంచివాళ్లు ప్రజా జీవితంలోకి వస్తే గుర్తింపు ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మను గెలిపించాలని కోరారు.

# జగన్ మానసిక స్థితి బాగాలేదనిపిస్తోంది: మంత్రి అచ్చెన్నాయుడు

**రాజకీయాల్లో గెలుపోటములు సహజమని.. ఓడిపోతే అందుకు కారణాలు సమీక్షించుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.**

అమరావతి, ఫిబ్రవరి 19, (రిపబ్లిక్ న్యూస్): రాజకీయాల్లో గెలుపోటములు సహజమని.. ఓడిపోతే అందుకు కారణాలు సమీక్షించుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 150 సీట్లతో అధికారంలోకి వచ్చిన వ్యక్తి.. ఐదేళ్ల ప్యాలెస్లకే పరిమితం అయ్యారని విమర్శించారు. ప్రతిపక్షాలు, మీడియా ఎంత ఘోషించినా ఐదేళ్లూ ప్యాలెస్ లు వీడలేదన్నారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండొద్దనే ఈ ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. అధికారంలో ఉన్నా.. విపక్షంలో ఉన్నా.. నిరంతరం ప్రజల కోసం పనిచేసేవాడే నిజమైన నాయకుడని చెప్పారు.



జగన్ మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి బాగాలేదనిపిస్తోందన్నారు. జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "జగన్ మిర్చియార్డు వద్ద పచ్చి అబద్ధాలు చెప్పారు. ఎవరైనా నవ్వుకుంటున్నారన్న స్పృహ కూడా లేదు. గుంటూరు మిర్చి యార్డు ఇప్పుడు కొత్తగా రాలేదు.. గతంలోనూ ఉంది. జగన్ సొంత మీడియాలో అబద్ధాలు ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్రంలో 11 జిల్లాల్లో మిర్చి పంట పండుతోంది. ధర రూ.13వేలకు పడిపోయిందని జగన్ అంటున్నారు. గత పదేళ్లలో మిర్చి ధరలు పరిశీలిస్తే.. అత్యధికంగా రూ.13వేలు ధర ఉంది. రెండేళ్లు మాత్రమే మిర్చి రైతులకు రూ.20వేలు ధర పలికింది. మిర్చి రైతులకు ఇబ్బందులున్న మాట వాస్తవం.. సాగు ఖర్చులు పెరిగాయి. పని లేకపోవడంతోనే జగన్ అనవసర విమర్శలు చేస్తున్నారు. ఐదేళ్లూ నాటకాలాడి ఇప్పుడేమో ప్రేమ ఒలకబోస్తున్నారు. జగన్ పాలనలో వ్యవసాయశాఖను పట్టించుకున్న పాపానపోలేదు. ఆదాయం తెచ్చే శాఖలకు జగన్ తాళం వేసి బిగించారు. ఇప్పుడు ఆయన వాటి గురించి మాట్లాడుతున్నారు. ఐదేళ్ల పాలనలో జగన్ రైతుల కోసం ఒక్క మంచి పని చూడా చేయలేదు. సెంటు భూమికి కూడా భూపరీక్షలు చేయించలేదు. వ్యవసాయశాఖను అటకపై పెట్టారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ఒక్క పైసా ఖర్చు చేయలేదు. తాను పుట్టిన రాయలసీమలోనూ డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వలేదు. జగన్ రైతులకు పెట్టిన రూ.1600 కోట్ల బకాయిలను మేం వచ్చాక చెల్లించాం. టమాటా ధర తగ్గితే మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేశాం. ఈ 8 నెలల్లో ఎరువులు బఫర్ స్టాక్ పెట్టాం. ప్రకృతి విపత్తుల సమయంలో జగన్ ఏనాడూ పైసా ఇవ్వలేదు. మేం వెంటనే పరిహారం చెల్లించాం. రైతులకు మేలు చేయాలనేదే కూటమి ప్రభుత్వం ఆలోచన" అని అచ్చెన్నాయుడు అన్నారు.

# తప్పుడు ప్రచారం చేస్తే.. 56 కోట్ల మంది విశ్వాసంతో ఆడుకున్నట్లే : యోగి

**సంగం నీరు తాగేందుకు అనుకూలంగా ఉన్నాయని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు.**

(రిపబ్లిక్ న్యూస్), ఫిబ్రవరి 19: ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద గత నెల నుంచి భక్తులు మహాకుంభమేళా పుణ్యస్నానాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో ఓ నివేదిక కలకలం సృష్టిస్తోంది. నది నీటిలో బ్యాక్టీరియా సాధారణం కంటే అధికంగా ఉందని, స్నానం చేయడానికి తగ్గ ప్రమాణాలకు అనుగుణంగా నీరు లేదని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వెల్లడించింది. దీనిని తాజాగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. నది నీళ్లు తాగేందుకూ అనుకూలంగా ఉన్నాయని అన్నారు. అలాగే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన విమర్శలను తోసిపుచ్చారు.



ఈ మేరకు అసెంబ్లీలో మాట్లాడారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నివేదిక ఆధారంగా స్పందించిన జాతీయ హరిత ట్రైబ్యునల్.. మహాకుంభ్ వివిధ ప్రాంతాల్లో అధిక స్థాయిల్లో బ్యాక్టీరియా ఉందని పేర్కొంది. ప్రయాగ్‌రాజ్‌లో ప్రవహిస్తోన్న నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తోన్న వారి సంఖ్య ఎక్కువకావడంతో బ్యాక్టీరియా పెరిగిందని తెలిపింది. దీనిపై యోగి స్పందిస్తూ.. "సంగమం వద్ద నీరు తాగేందుకు అనుకూలంగా ఉంది. సనాతన ధర్మం, గంగామాత, భారత్ గురించి తప్పుడు ప్రచారం చేస్తే.. 56 కోట్ల మంది విశ్వాసంతో ఆడుకున్నట్లే" అని అన్నారు. యూపీ ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఇప్పటివరకు 56.25 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించారు. మహా కుంభమేళాలో గత నెలలో జరిగిన తొక్కిసలాటలో 30 మంది, ప్రయాగ్‌రాజ్ వెళ్లే భక్తుల రద్దీ కారణంగా దిల్లీ రైల్వే స్టేషన్లో ఇటీవల జరిగిన తొక్కిసలాటలో 18 మంది మరణించిన సంగతి తెలిసిందే. వీటిపై మమత విమర్శలు చేశారు. "ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంపై రాజకీయాలు చేయడం ఎంతవరకు సముచితం. తొలిరోజు నుంచి మహాకుంభ్కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఈ శతాబ్దంలో జరుగుతోన్న కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉంది. అందుకే తప్పుడు ప్రచారాలు పట్టించుకోకుండా ఈ ప్రపంచం, ఈ దేశం పాల్గొంటోంది" అని యోగి వెల్లడించారు. ప్రయాగ్లోని త్రివేణి సంగమం వద్ద జనవరి 13న మహాకుంభ మేళా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నెల 26 వరకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించాలని యూపీ ప్రభుత్వం నిర్ణయించింది. మహా కుంభమేళాకు 45 కోట్ల మంది వస్తారని యూపీ ప్రభుత్వం తొలుత అంచనా వేసింది. అయితే ఊహకందని రీతిలో ఇప్పటికే 56 కోట్ల మంది భక్తులు విచ్చేశారు. మరో 7 రోజులు మిగిలి ఉండడంతో భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉంది.

# ఏడు నెలల విరామం తర్వాత.. తెలంగాణ భవన్‌కు కేసీఆర్

**భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఏడునెలల విరామం తర్వాత పార్టీ కార్యలయానికి ఆయన వచ్చారు.**



హైదరాబాద్, ఫిబ్రవరి 19, (రిపబ్లిక్ న్యూస్): భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఏడునెలల విరామం తర్వాత పార్టీ కార్యలయానికి ఆయన వచ్చారు. భారాస విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ పాల్గొన్నారు. పార్టీని స్థాపించి 24 ఏళ్లు పూర్తయి 25వ ఏట అడుగు పెడుతున్న నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నేతలతో ఆయన చర్చించనున్నారు. ఆవిర్భావ వేడుకలు, సభ్యత్వ నమోదు, భారీ బహిరంగ సభ తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్టాల్సిన కార్యాచరణపై పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

# రైతులకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధం: సోమిరెడ్డి


**జగన్ మిర్చి యార్డుకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని తెదేపా సీనియర్ నేత సోమిరెడ్డి అన్నారు.**

మంగళగిరి, ఫిబ్రవరి 19, (రిపబ్లిక్ న్యూస్): జగన్ మిర్చి యార్డుకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని తెదేపా సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మంగళగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ హయాంలో మిర్చి రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. వైకాపా ప్రభుత్వంలో వ్యవసాయశాఖను మొత్తానికే మూసేశారని మండిపడ్డారు. మిర్చి పంటకు తెగుళ్లు వస్తే జగన్ పట్టించుకోలేదని, కనీసం రైతులకు స్ప్రేయర్లు కూడా జగన్ ప్రభుత్వం ఇవ్వలేదని దుయ్యబట్టారు. "2014-19, 2019-24 మధ్య రైతులకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధంగా ఉన్నాం. వైకాపా హయాంలో రైతు ఆత్మహత్యలు ఎక్కువ జరిగాయి. ధాన్యం కొన్న ఆరు నెలలకు జగన్ డబ్బులు ఇచ్చారు. రేపు చంద్రబాబు దిల్లీ వెళ్తారు. అక్కడ కేంద్రమంత్రిని కలిసి మిర్చి రైతుల సమస్యల గురించి వివరిస్తారు. మరి జగన్ దిల్లీ వెళ్లినప్పుడు ఏనాడైనా రైతుల గురించి మాట్లాడారా? జైలు, బెయిల్ గురించి తప్ప మరో అంశం చెప్పారా? "అని సోమిరెడ్డి ప్రశ్నించారు.



# మెరిట్ ఆధారంగానే వైస్ ఛాన్సలర్ల నియామకం: సీఎం చంద్రబాబు

**ఆంధ్రప్రదేశ్లో ఉన్నత విద్య సరికొత్త అధ్యాయాన్ని సూచిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.**




అమరావతి, ఫిబ్రవరి 19, (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్య సరికొత్త అధ్యాయాన్ని సూచిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. వైస్ ఛాన్సలర్లను పూర్తి మెరిట్ ఆధారంగా నియమించామని తెలిపారు. భావి పౌరులను తీర్చిదిద్దడంలో ఉన్నత విద్య కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గత పాలనలో రాజకీయ ప్రభావం, లాబీయింగ్తో వీసీల నియామక ప్రక్రియ బలహీనపడిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెరిట్ ఆధారిత వ్యవస్థ.. సేవ చేయడానికి అర్హులైన వ్యక్తులను నియమించేలా చేస్తుందన్నారు. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహిస్తూనే ఈ విధానం ఇప్పటికే ఫలితాలను అందిస్తోందని సీఎం వెల్లడించారు. మొదటిసారిగా ఎస్టీ మహిళ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ వైస్ ఛాన్సలర్ గా నియమితులయ్యారన్నారు. ఇది విద్య, సామాజిక న్యాయానికి గర్వకారణమైన మైలురాయిగా సీఎం పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన వైస్ ఛాన్సలర్లందరినీ సీఎం అభినందించారు. విద్య, విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో వారి పదవీకాలం విజయవంతం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1473: సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన నికోలస్ కోపర్నికస్ జననం. (చిత్రంలో)
- 1630: మరాఠా సామ్రాజ్యానికి ఆద్యుడైన ఛత్రపతి శివాజీ జననం (మ.1680).
- 1905: తెలుగు సినిమా రచయిత వెంపటి సదాశివబ్రహ్మం జననం (మ.1968).
- 1915: భారత స్వాతంత్ర్య సమర యోధుడు గోపాలకృష్ణ గోఖలే మరణం (జ.1866).
- 1930: తెలుగు సినిమా దర్శకుడు కె. విశ్వనాథ్ జననం (మ.2023).
- 1941: కవి, శాసన పరిశోధకుడు, గ్రాంథిక భాషను సమర్థిస్తూ ఉద్యమించిన జయంతి రామయ్య పంతులు మరణం (జ.1860).
- 1956: ఆచార్య నరేంద్రదేవ్ మరణం (జ.1889).
- 1900: గుజరాత్ రెండవ ముఖ్యమంత్రి బల్వంతరాయ్ మెహతా జననం (మ.1965).


నికోలస్ కోపర్నికస్


హెన్రీ పెక్వెట్





వెంపటి సదాశివబ్రహ్మం


గోపాలకృష్ణ గోఖలే


కె. విశ్వనాథ్


రామయ్య పంతులు


ఆచార్య నరేంద్రదేవ్


బల్వంతరాయ్ మెహతా

రిపబ్లిక్ స్పోర్ట్స్

## దిగొచ్చిన పాకిస్థాన్.. ఆ స్టేడియంలో భారత జెండా


భారత జాతీయ జెండా విషయంలో తలెత్తిన వివాదానికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ముగింపు పలికింది.



పాకిస్థాన్ ఆతిథ్యంలో జరిగే ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ నేటినుంచే. ఈ టోర్నీకి ముందు ఇటీవల కరాచీ స్టేడియంలో చోటుచేసుకున్న ఓ ఘటన తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. భారత జెండాను ఆ స్టేడియంలో ప్రదర్శించకపోవడంతో పాక్ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో పీసీబీ దిగొచ్చింది. దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తాజాగా ఆ స్టేడియంలో భారత పతాకాన్ని ప్రదర్శించింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. ఇటీవల కరాచీ స్టేడియంలో అన్ని జట్ల జాతీయజెండాలను ప్రదర్శించగా.. అందులో భారత పతాకం లేదు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. దీంతో పాక్ తీరుపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిపై పీసీబీ వర్గాలు స్పందించాయి. "ఛాంపియన్స్ ట్రోఫీలో మ్యాచ్లు ఆడేందుకు పాక్కు భారత్ రావట్లేదు. కరాచీ, రావల్పిండి, లాహోర్ స్టేడియాల్లో మ్యాచ్లు ఆడుతున్న జట్ల జెండాలను ఎగురవేశాం. భారత్ తన మ్యాచ్లు దుబాయ్ ఆడుతుంది. బంగ్లాదేశ్ ఇంకా పాక్కు రాలేదు. బంగ్లా తన తొలి మ్యాచ్ను దుబాయ్ భారత్తో ఆడుతుంది. కాబట్టి భారత్, బంగ్లా జెండాలు ఎగరవేయలేదు. పాక్కు వచ్చిన మిగతా జట్ల పతాకాలు స్టేడియాల్లో కనిపిస్తున్నాయి. దీనిపై పీసీబీ అధికారికంగా ప్రకటన చేయాల్సిన అవసరం లేదు" అని పీసీబీ వర్గాలు తెలిపాయి. అయితే.. దీనిపై తీవ్ర విమర్శలు కొనసాగుతుండటంతో ఈ వివాదానికి పీసీబీ ముగింపు పలికినట్లు తెలుస్తోంది. తాజాగా కరాచీ స్టేడియానికి సంబంధించి సోషల్ మీడియాలో షేరవుతున్న వీడియోలో భారత జాతీయ పతాకం కనిపిస్తోంది. చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే 8 జట్ల జాతీయ జెండాలు ఇందులో దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ వివాదానికి ఫుల్స్టాప్ పడింది. పాకిస్థాన్లో ఆడేది లేదని టీమ్ ఇండియా తేల్చి చెప్పడంతో.. ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్కు మార్చిన విషయం తెలిసిందే. భారత్ ఆడే మ్యాచ్లకు దుబాయ్ వేదిక కానుంది. ఒకవేళ భారత్ లీగ్ దశ నుంచి సెమీస్, ఫైనల్కు చేరితే.. ఆ మ్యాచ్లు కూడా అక్కడే జరగనున్నాయి. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాక్ మ్యాచ్ ఈనెల 23న దుబాయ్ వేదికగా జరగనుంది.

## రాజమౌళి-రష్మీ
### ఓ సరదా లవ్ ట్రాక్.. రేర్ వీడియో వైరల్

ప్రముఖ దర్శకుడు రాజమౌళి, యాంకర్ రష్మీ గతంలో ఓ ప్రాజెక్ట్ కోసం కలిసి యాక్ట్ చేశారు. దీనికి సంబంధించిన రేర్ వీడియో తాజాగా నెట్టింట వైరల్గా మారింది.





భారీ బడ్జెట్ చిత్రాలతో దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. దర్శక ధీరుడు రాజమౌళి. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ ఆయన ప్రేక్షకులకు సుపరిచితమే. 'సై', 'మజ్ను', 'బాహుబలి', 'కల్కి 2898 ఏడీ' వంటి చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించి సినీ ప్రియులను ఆశ్చర్యపరిచారు. గతంలో ఆయన ఓ ధారావాహికలోనూ యాక్ట్ చేశారు. దీనికి సంబంధించిన రేర్ వీడియో వైరల్ గా మారింది. యాంకర్గా గుర్తింపుపొందిన నటి రష్మీ.. కెరీర్ ఆరంభంలో పలు టీవీ సీరియల్స్ కోసం వర్క్ చేసిన విషయం తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో యాక్ట్ చేసిన సీరియల్ 'యువ'. యూత్ఫుల్ కంటెంట్తో నాటి యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ సీరియల్లో జక్కన్న గెస్ట్ రోల్లో కనిపించారు. ఇందులో రాజమౌళి- రష్మీపై ఒక సరదా లవ్ ట్రాక్ ఉంటుంది. 'ఐ లవ్ యూ' అంటూ ఆమె తన మనసులోని మాట చెబుతుంది. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. వీరిద్దరూ ఎప్పుడు నటించారు? ఇదెప్పుడు జరిగిందంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరికొందరేమో ఇది నిజం కాదని.. ఏఐ జనరేటెడ్ వీడియో అని అనుకుంటున్నారు. అసిస్టెంట్ దర్శకుడిగా కెరీర్ ఆరంభించిన రాజమౌళి 'శాంతి నివాసం' అనే సీరియల్ తో దర్శకుడిగా తొలి అడుగువేశారు. ఆయన దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'స్టూడెంట్ నం.1'. 'బాహుబలి 1, 2', 'ఆర్ఆర్ఆర్'లతో ఆయన విదేశాల్లోనూ పేరు ప్రఖ్యాతులు పొందారు. ప్రస్తుతం ఆయన మహేశ్ బాబు ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్ కె.ఎల్. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గత నెలలో ప్రారంభమైన ఈ చిత్రం కొన్నాళ్లపాటు చిత్రీకరణ చేసుకొంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

## రామ్ చరణ్ సినిమాపై బుచ్చిబాబు ఆసక్తికర కామెంట్

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఆర్.సి 16 రానుంది. ఈ సినిమా గురించి బుచ్చిబాబు ఓ ఈవెంట్లో మాట్లాడారు.



రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు ఓ సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ హీరోయిన్. ఆర్సి 16 (వర్కింగ్ టైటిల్) పేరుతో రూపొందుతోంది. తాజాగా నటుడు బ్రహ్మాజీ ప్రధానపాత్రలో తెరకెక్కిన 'బాపు' చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్కు ముఖ్యఅతిథిగా బుచ్చిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ సినిమాపై ఆయన ఆసక్తికర కామెంట్ చేశారు. "మా నాన్న చాలా కష్టపడి మమ్మల్ని పెంచారు. ఆయన మా నుంచి భౌతికంగా దూరమై ఏడాది అవుతోంది. 'ఉప్పెన' సినిమా విడుదల సమయంలో ఆయన చేసిన పని ఇంకా గుర్తుంది. థియేటర్ గేట్ బయట నిలబడి సినిమా బాగుందా' అని వచ్చిన వారందరినీ అడిగేవారట. ఆయన సినిమా కూడా చూడకుండా థియేటర్కు వచ్చిన వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. నేను ప్రస్తుతం తీస్తున్న రామ్చరణ్ సినిమా బాగుందా అని ఎవరినీ అడగాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అది కచ్చితంగా హిట్ అవుతుంది" అని చెప్పారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోను ఫ్యాన్స్ షేర్ చేస్తున్నారు. రామ్ చరణ్ హీరోగా ఇటీవల వచ్చిన 'గేమ్ ఛేంజర్' ఆశించిన స్థాయిలో అలరించలేకపోవడంతో ఆయన అభిమానులు ఆర్సీ 16పై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇక 'బాపు' ప్రీ రిలీజ్ ఈవెంట్కు దర్శకుడు నాగ్ అశ్విన్ కూడా అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. "తెలుగు ఆడియన్స్ చాలా మంచివాళ్లు. సినిమా బడ్జెట్ను చూడరు. కథ బాగుంటే కచ్చితంగా హిట్ చేస్తారు. ఈ సినిమా కూడా హిట్ కావాలని కోరుకుంటున్నాను. నేను తండ్రి అయిన తర్వాత ఆ గొప్పతనం తెలిసి వచ్చింది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలోనే దర్శకుడు చందు మొండేటి మాట్లాడుతూ.. చిన్న సినిమా పెద్ద సినిమా అనేది ఉండదన్నారు. మంచి సినిమా ఏదైనా పెద్ద సినిమానే అన్నారు. ఫిబ్రవరి 21న విడుదల కానున్న 'బాపు' మంచి విజయం సాధించాలన్నారు.

## అందం

### జుట్టుకి బయట కొనుక్కొచ్చిన హెయిర్ కలర్స్ బదులు ఇంట్లోనే తయారుచేసిన కలర్స్ వాడితే ఒత్తుగా పెరుగుతుంది

ఇదివరకటి రోజుల్లో జుట్టు నల్లగానే ఉంటే అందంగా ఉంటుందనుకునేవారు. కానీ, రాన్రాను ఫ్యాషన్ పెరిగిపోయి రకరకాల రంగులు వేసుకోవడం మొదలుపెట్టారు. అలాంటి హెయిర్ కలర్స్ని ఇంట్లోనే ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకోండి.

జుట్టుకి కలర్ వేయడం ఇప్పుడు ఫ్యాషన్. కాలేజీకి వెళ్లే వారి దగ్గర్నుంచి ఆఫీస్ వెళ్లేవారి వరకూ రకరకాల కలర్స్ వేసుకోవడం అలవాటుగా మారింది. బర్గండీ, మెరూన్, గ్రే ఇలాంటి కలర్స్ వేసుకుంటూ అందంగా మురిసిపోతారు. ఇదిప్పుడు ఫ్యాషన్గా కూడా మారింది. దీంతో మార్కెట్లో రకరకాల రంగుల్లో హెయిర్ కలర్స్ని తయారుచేసి ప్రవేశపెట్టారు. అయితే, ఇవన్నీ చూడ్డానికి చక్కగా కనిపించినప్పటికీ అందులో కొన్ని కెమికల్స్ ఉంటాయి. అవి జుట్టుని డ్రైగా చేసి పాడు చేస్తాయి. వీటితో పాటు జుట్టు నిర్జీవంగా మారుతుంది. దీంతో జుట్టుకి లేనిపోని హంగులు ఎందుకు జుట్టు బాగుంటే అదే చాలని కలర్స్కి ఫుల్స్టాప్ పెడుతున్నారు. అలా కాకుండా ఇంట్లోనే మనం కొన్ని కలర్స్ని తయారుచేసి హ్యాపీగా స్టైల్ చేయొచ్చు. దీని వల్ల మీకు నచ్చిన రంగుని వేసుకోవచ్చు. జుట్టుని సిల్కీ అండ్ స్మూత్గా చేసుకోవచ్చు. అంతేకాకుండా స్ట్రాంగ్గా కూడా మారుతుంది. మరింకెందుకు ఆలస్యం వీటిని ఎలా తయారుచేయొచ్చో తెలుసుకోండి.



#### దాల్చినచెక్కతో



మంచి రెడీష్ బ్రౌన్ కలర్ రావాలంటే దాల్చిన చెక్కని ట్రై చేయొచ్చు. దీనికోసం అరకప్పు కండీషనర్లో అరకప్పు దాల్చిన చెక్క పొడిని వేసి బాగా కలపాలి. దీనిని మన జుట్టుకి మాస్క్లా వేసి 45 నుంచి 60 నిమిషాల పాటు ఉంచాలి. తర్వాత షాంపూ చేయాలి. ఇలా చేయడం వల్ల దాల్చినచెక్కలోని మాయిశ్చరైజింగ్ గుణాలు జుట్టుని సాఫ్ట్గా చేస్తాయి. అందంగా మారుస్తాయి.

#### కాఫీ కలర్తో



దీనికోసం మనం అరకప్పు ఎస్ప్రెస్సోని తీసుకోవాలి. దీనిని అరకప్పు కండీషనర్లో కలపాలి. తర్వాత ఇందులోనే 1 టేబుల్ స్పూన్ కాఫీ పౌడర్ కలపాలి. దీనిని బాగా కలిపితే మంచి కలర్లా మారుతుంది. దీనిని మన జుట్టుకి మాస్క్లా వేసుకోవాలి. 60 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోవాలి. కాఫీ అనేది జుట్టుకి మంచి టానిక్లా పనిచేస్తుంది. కాఫీని అప్లై చేయడం వల్ల హెయిర్ సెల్స్ స్టిమ్యులేట్ అవుతాయి. దీంతో జుట్టు సమస్యలు కూడా దూరమై జుట్టు స్ట్రాంగ్ అవుతుంది.

#### ఫుడ్ కలర్తో



ఫుడ్కలర్తో కూడా జుట్టుకి మంచి కలర్ని తీసుకురావొచ్చు. దీనికోసం అరకప్పు మంచి హెయిర్ కండీషనర్ తీసుకోండి. ఇందులో కొన్ని చుక్కల మీకు ఇష్టమైన ఫుడ్ కలర్ని యాడ్ చేయండి. మీకు ఎక్కువగా థిక్గా కావాలనుకుంటే ఎక్కువ కలర్ యాడ్ చేయండి. ఫుడ్ కలర్ యాడ్ చేయడం వల్ల జుట్టుకి మంచి కలర్ వస్తుంది. కెమికల్ ఫ్రీ కలర్ కాబట్టి, జుట్టు అందంగా, సాఫ్ట్గా మారుతుంది. ఈ కలర్ మీకు జుట్టుకి కావాల్సిన చోట అప్లై చేసి 15 నుంచి 20 నిమిషాల పాటు ఉంచాలి.

#### బీట్రూట్తో




మంచి పర్పుల్, బర్గండీ కలర్లో జుట్టు మారాలంటే ఇది బెస్ట్ ఆప్షన్. ఓ బీట్రూట్ని చక్కగా చిన్నచిన్న ముక్కలుగా కట్ చేయండి. దీనిని ఓ టీ స్పూన్ తేనె, 1 టీ స్పూన్ కొబ్బరినూనెతో కలిపి ఓ బౌల్లో వేసి పెట్టండి. దీనిని జుట్టుకి రాసి 60 నిమిషాల పాటు అలానే ఉంచి ఆ తర్వాత మైల్డ్ షాంపూతో తలని రుద్దండి. దీంతో జుట్టు మంచి పర్పుల్ కలర్లో అందంగా మారుతుంది. బీట్రూట్లో నేచురల్గానే మంచి కలర్ ఉంటుంది. ఇది జుట్టుకి మంచి రంగుని ఇవ్వడమే కాకుండా స్కాల్ప్, హెయిర్ని హెల్దీగా మారుతుంది. బౌన్సీగా మారుతుంది. జుట్టు కూడా స్మూత్గా మారుతుంది.

#### క్యారెట్ జ్యూస్



కొంతమందికి రెడీష్ ఆరెంజ్ కలర్ అంటే ఇష్టం. అలాంటి వారు క్యారెట్తో చక్కని కలర్ని రెడీ చేసుకోవచ్చు. దీనికోసం 1 టేబుల్ కొబ్బరినూనె లేదా ఆలివ్ ఆయిల్లో ఓ టేబుల్ స్పూన్ క్యారెట్ జ్యూస్ కలపాలి. బాగా మిక్స్ చేయాలి. దీనిని జుట్టుకి అప్లై చేసి చేయాలి. 60 నిమిషాల పాటు అలానే ఉంచి ఆ తర్వాత కొద్దిగా ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపిన నీటితో వాష్ చేసుకోవాలి. దీంతో మంచి షైనీ కలర్ వస్తుంది. క్యారెట్స్లో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. దీనిని రాయడం వల్ల జుట్టు పొడుగ్గా, ఒత్తుగా పెరుగుతుంది.



గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.